నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శుక్రవారం | జూన్ 07, 2024 | www.navatelangana.com

భారీ మీనం

• మత్స్యకారులకు చిక్కిన 32 కేజీల బొచ్చచేప

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

డొంకేశ్వర్ మండలం సిర్పూర్ గ్రామనికి చెందిన మత్స్యకారులు వలలో బొచ్చ (కాట్లా) రకం చేప చిక్కింది. దాని బరువు తూకం వేయగా.. 32 కిలోలు వచ్చింది. దాని వయసు సుమారు ఆరు సంవత్సరాలు ఉంటుందని, శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో తిరుగుతున్నట్టు మత్స్య శాఖ అధికారి రాజనర్సయ్య తెలిపారు. ప్రస్తుతం బొచ్చ చేప కిలో 120 రూపాయలు చొప్పున ధర పలుకుతుందని మత్సకారులు అన్నారు.



32 కేజీల చేప

నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తా

• జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్

నవతెలంగాణ-దోమకొండ

జహీరాబాద్ నియోజకవర్గం అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని ఎంపీ సురేష్ శెట్కార్ అన్నారు. హైదరాబాద్ మాజీ మంత్రి మహ్మద్ షబ్బీర్ అలీని, ఎంపీ సురేష్ శెట్కార్ ను నివాసంలో దోమకొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనంత రెడ్డి, జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువా తో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ సురేష్ శెట్కార్ మాట్లాడుతూ నియోజకవర్గన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఎంపీ సురేష్ శెట్కార్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం లో జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనంత రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్రబోయిన స్వామి, నర్సరెడ్డి,నల్లపు శ్రీనివాస్, రామ స్వామి గౌడ్, రాజు, మధు, షమ్మీ మల్లేశం, నహీమ్, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీని సన్మానిస్తున్న పలువురు

ఎవుసం.. భారం

• ఏటేటా పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు • అందుకు తగ్గట్టు పెరగని పంట మద్దతు ధర • ఎకరానికి సుమారు రూ.34 వేల ఖర్చవుతుండగా.. • రాబడి సుమారు రూ.44 వేలే

• ఆరు నెలల ఇంటిల్లిపాది శ్రమకు వచ్చే లాభం రూ.10 వేలే • ప్రకృతి ప్రకోపం చూపితే.. ఆ ఏడు నష్టాలే • రైతుచుట్టూ రాజకీయం.. అయినా చూపని కనికరం

నవతెలంగాణ-వర్ని

రైతు అంటే రాజంటారు. దేశానికి అన్నం పెట్టే దేవుడంటారు. కానీ అలాంటి రైతులను ఆదుకునే దిక్కు లేకుండా పోతోంది. ప్రతేడూ పెట్టుబడులు అమాంతం పెరుగుతున్నా.. అందుకు తగ్గట్టు పంట మద్దతు ధరలు మాత్రం పెరగడం లేదు. క్వింటాకు ధర అరకొర పెంచుతూ పాలకులు చేతులు విదుల్చుతున్నారు. వ్యవసాయం తప్ప ఇతర పనులు ఎరుగని రైతులు.. భూమిని నమ్ముకుని సాగుతో బతుకుబండిని లాగిస్తున్నారు. రైతు ఇంటిల్లిపాది ఆరు నెలల పాటు శ్రమిస్తే.. ఎకరానికి పదివేలు సైతం అందని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు ప్రకృతి ప్రకోపాలు, చీడపీడల బెడద వేధిస్తే.. ఆ ఏడు అప్పుల పాలే కావాల్సిందే.

ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో రైతులు సాగు పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. బాన్సువాడ, వర్ని, బోధన్, ఎడపల్లి తదితర ప్రాంతాల్లో ఇది వరకే నారు మడులు సిద్ధం చేశారు. ఇక నాట్లు వేసుడే తరువాయి. అయితే నారు పోసింది మొదలు దుక్కులు దున్నడం నాట్లు, కోతల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించే వరకూ ప్రతిదీ డబ్బుతో కూడుకున్నవే. అయితే ప్రతేటా వీటి ఖర్చులు పెరుగుతుండ టంతో రైతులకు ఏటికేడూ పెట్టుబడులు అమాంతం పెరుగుతున్నాయి. పెట్టుబడులకు చేతిలో డబ్బులు లేకపోతే.. అప్పులు చేస్తూ మళ్లీ వచ్చే పంట వచ్చాక తీరుస్తూ మళ్లీ అప్పులు చేస్తున్నారు. ఆ అప్పులు తీర్చే మార్గం లేక.. వడ్డీలు కడుతూ నెట్టుకొస్తున్నారు. పాలకులు ఆదుకోక.. అప్పు తీర్చే మార్గం కనబడక పలువురు రైతులు ఉరికొయ్యలకు వేలాడే పరిస్థితి నెలకొంది.

ఎకరం ఖర్చు 34 వేల పైమాటే..

పంట వేసేందుకు తొలుత దుక్కిదున్నడం మొదలు.. పంట చేతికొచ్చే వరకు ఒక ఎకరానికి సుమారు 34 వేల రూపాయలకు పైగా ఖర్చవుతుంది. ట్రాక్టర్, కూలీల రేట్‌లు ప్రతేడూ పెరుగుతూనే ఉన్నాయి. గతంలో ఎకరం దుక్కిదున్నడానికి ఒక సాలుకు రూ.600 తీసుకుంటుండగా.. ఈసారి 700కు పెరిగింది. రెండు సాల్లు దున్నడానికి ఎకరానికి రూ.1400 వెచ్చించాల్సి వస్తుంది. వీటితో పాటు విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల ధరలు సైతం పెరిగాయి. చివరకు వరి కోత మిషన్‌లకు సైతం ప్రతేటా ధరలు పెంచుతూ పోతుండటంతో సాగు భారంగా మారుతుంది.

రైతు తనకు ఉన్న ఎకరం అయినా పది ఎకరాలు అయినా ఒక ఎకరానికి ట్రాక్టర్ ఖర్చు నాలుగు సాలులకు 900 వందల చొప్పున 5 వేలు (10) మంది కూలీలకు 400/- చొప్పున 4 వేలు, గెట్టు కొట్టు మగ వారికి 650 చొప్పున ఇద్దరికీ 1200/- కూలీ చెల్లిస్తున్నారు. నారు పోసిన నాటి నుంచి కోత వరకు ఎరువులకు, పై పిచికారి మందులకు 15000 రూపాయలు ఖర్చు అవుతుంది. చివరి వరకు పంటను దిగుబడి వచ్చేలా మరింత ప్రయత్నం రైతు చేస్తే మరో 2000/- వేయిలు అవుతున్నట్లు రైతులు తెలుపుతున్నారు. అయినా రైతులకు ఎకరానికి అన్ని పోను మిగులుడు అంతంతే.



ఎకరం వరి పంటసాగుకు అయ్యే ఖర్చు (సుమారు)

దుక్కిదున్నిడం(ట్రాక్టర్)	-	1400
నారుమడికి దమ్ముకొట్టుడు	-	900
విత్తనాలు 25 కిలోల సంచి	-	1280
యూరియా, నత్రజని	-	1730
తెగుళ్ల సోకకుండా పిచికారి	-	1000
దమ్ము కొట్టించునందుకు	-	3600
గెట్టు కొట్టుడు(ఇద్దరికి)	-	1300
నాటువేయదానికి	-	4000
గడ్డి మందు కలిపి	-	650
యూరియా(1వసారి)		
యూరియా, నత్రజని	-	4100
పోటాషియం(2వ)		
మూడోసారి పిచికారి	-	4100
తెగుళ్ల నివారణ మందులు	-	6000
కోత మిషన్	-	2200
ట్రాక్టర్‌లో ధాన్యం తరలింపు	-	1800
మొత్తం	-	రూ.34060



ఇంటిల్లిపాది ఆరు నెలల శ్రమ

వ్యవసాయం సాగు పనుల్లో రైతు కుటుంబీకులు భాగస్వాముల వుతుంటారు. ఇంట్లో నలుగురు ఉన్నా.. ప్రతిఒక్కరూ సందర్భాన్ని బట్టి సాగు పనుల్లో పాలుపంచుకుంటుంటారు. ప్రస్తుతం ఒకరా పంటకు సుమారు రూ.34 వేల వరకు ఖర్చవుతుండగా.. ఎకరం పంటలో సాగు చేస్తే 45-55 సంచుల (22 క్వింటాళ్లు) వడ్లు వస్తున్నాయి. ప్రస్తుతం మద్దతు ధర 2208 ఉండగా.. ఈ లెక్కన 22 క్వింటాళ్లకె లెక్కిస్తే 48,400 రూపాయలు మాత్రమే వస్తున్నాయి. అంటే ఇంటిల్లిపాది శ్రమపడితే ఆరు నెలలకు ఎకారినికి 5 నుంచి 10 వేల రూపాయలు మాత్రమే మిగులుతుంది. పంటకు చీడపీడలు సోకినా, పకృతి ప్రకోపం చూపినా.. కొనుగోళ్లల్లో కొర్రీలు పెట్టిన.. ఆ ఏడు రైతులు తీవ్రంగా నష్టపోవడమే.

గిట్టుబాటు ధర ఉంటేనే రైతుకు మిగిలుబాటు..

రైతు సాగు చేసి గింజ చేతి కోచ్చి అమ్ముకొనే వరకు పెట్టిన పెట్టుబడి పోను మిగులుబాటు కావాలంటే రైతుకు గిట్టుబాటు ధర నిర్ణయించాలి. కోత సమయం లో వాతావరణం అనుకూలంగా ఉంటే రైతుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. కొనుగోలు చేసే దళారులు కానీ, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు కానీ కొర్రీలు పెడుతే అప్పుల పాలు కావడమే. పంటలకు మద్దతు ధర పెంచితేనే రైతులకు మేలు చేసే అవకాశం ఉంది.

మద్దతు ధర పెంచాలి..



మేము పడుతున్న కష్టానికి, వస్తున్న లాభానికి పొంతనే లేదు. ఆరు నెలల పాటు గొడ్డుచాకిరి చేస్తున్నా. చివరకు అప్పుల పాలవుతున్నాము. మాకు లాభాలు రావాలంటే పంటలకు మద్దతు ధర పెంచాలి. అకాల వర్షాలకు నష్టపోయిన సమయంలో పంటలకు పరిహారం చెల్లించి ఆదుకోవాలి. బీమా సౌకర్యం సైతం కల్పించాలని. పంటలను సకాలంలో ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేయాలి. అప్పుడే రైతులు తమ పిల్లల చదువులకు, ఇంటి ఖర్చులను ఎల్లదీస్తారు.

యువ రైతు చందూర్

మెయింటేనెన్స్ ఖర్చులు పెరిగాయి..



ట్రాక్టర్లకు ముందు సాలుకి 700 ఉండేది. ఒక ట్రాక్టర్‌పై డ్రైవర్‌ను పెట్టుకొంటే ఒక రోజుకు 1500 రూపాయలు, నెలకు 45 వేయిలు ఇవ్వాల్సి వస్తుంది. సొంత ట్రాక్టర్ ఉన్న మాకు ట్రాక్టర్ డ్రైవర్ జీతం, మధ్యలో రిపర్లు ఉంటున్నాయి. వాటి ధరలు ఎక్కువగా ఉండటంతో మేము గ్రామ కమిటీల మాట ప్రకారం ప్రజలకు తెలిపి ధరలు పెంచుతున్నాము.

అంబర్ సింగ్. ట్రాక్టర్ యజమాని. వర్ని

పాలకులు రైతు సంక్షేమ చర్యలు చేపట్టాలి



ప్రస్తుతం పెరిగిన ధరలతో రైతులకు సాగుచేయడం భారంగా మారింది. పెట్టుబడులు భారీగా పెరిగాయి. అందుకుతగ్గట్టు మద్దతు ధర పెంచడం లేదు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలి. పంటలకు గిట్టుబాటు ధర అందజేయాలి. వరి నాట్ల సీజన్ మొదలు అయినందున రైతులకు సరి పడ ఎరువులు అందుబాటులో ఉంచాలి. నాణ్యమైన విత్తనాలు రైతులకు సబ్సిడీ ద్వారా ప్రభుత్వమే అందించాలి. ఫర్టిలైజర్ దుకాణాలలో అధికారులు ఇంక తనిఖీలు చేపట్టాలి. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి. పెట్టుబడి సాయ సకాలంలో చెల్లించాలి. చివరి దశలో తడసిన ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చెస్తే రైతులకు నష్టం ఉండదు.

పల్లపు వెంకటేశ్. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

అభివృద్ధిపై.. చర్చకు సిద్ధమా అరవింద్..?

- మతం పేరుతో ఓట్లు అడిగింది నువ్వు కాదా..?
- డబ్బులు పంచిన వీడియోలతో త్వరలో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం
- సుదర్శన్‌రెడ్డి మచ్చలేని నాయకులు
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

అభివృద్ధిలో మతం పేరుతో ఓట్లు అడిగే విషయంలో చర్చకు అరవింద్ సిద్ధమా అని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి సవాల్ విసిరారు. ఎంపీ అరవింద్ బుధవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పై చేసిన అసత్యపు ఆరోపణలను అహంకారపు వాక్యాలకు వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ భవన్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ గడిచిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మతం పేరుతో ఓట్లు అడిగిందని అరవింద్ ఆరోపిస్తున్నారని ,కానీ ఏ కుక్క మతం పేరిట ఓట్లు అడిగిందో అరవిందు గుర్తుంచుకోవాలని, బిజెపి నాయకులే మతం పేరుతో దేవుని పేరుతో ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగారని అన్నారు. ప్రతి గ్రామంలో ఐకెపి ఆర్పీల ద్వారా మహిళలకు 300 రూపాయలు అరవింద్ ఎన్నికల్లో పంచాడని, దానిని కాంగ్రెస్ పార్టీ నాయకులు వీడియోలు తీశారని, త్వరలోనే ఎలక్షన్ కమిషన్‌కు దీనిపై ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ఎన్నికల్లో పైసలు పంచిన అరవింద్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో పైసలు పెంచింది అని చెప్పడం విడ్డూరంగా ఉంది అని ఆయన అన్నారు. విలేకరుల సమావేశంలో పిచ్చికుక్కల అరవింద్ మాట్లాడుతున్నాడని అరవింద్ కు ధైర్యం ఉంటే డబ్బులు పంచిన విషయంలో గానీ, అభివృద్ధి విషయంలో గాని, మతం పేరుతో ఓట్లు అడిగిన విషయంలో గానీ చర్చకు రావాలని చర్చకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉంది అని సవాల్ విసిరారు. ఒక వినతి పత్రంతో పార్లమెంటు అభివృద్ధి కొరకు నిధులు తీసుకువస్తానని చెప్పిన్న అరవింద్ గడిచిన ఐదు సంవత్సరాలలో ఎక్కడ గడ్డి పీకాడో చెప్పాలని, మామిడిపల్లి వద్ద ఇంకా పూర్తికాని రైల్వే బ్రిడ్జి గాని ,మాధవ్ నగర్ వద్ద పూర్తికాని బ్రిడ్జి కానీ ఎందుకు పూర్తి చేయలేదని, నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక్క కొత్త రైల్వే బ్రిడ్జిని కూడా తీసుకురాని దద్దమ్మ అరవింద్ అని మానాల మోహన్ రెడ్డి అన్నారు. కానీ సుదర్శన్ రెడ్డి నిజామాబాద్ జిల్లాలో మెడికల్ కాలేజీని నిర్మించారాని, అలీసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా వేలాది ఎకరాలకు నీరు అందించారని, జిల్లా అభివృద్ధిలో సుదర్శన్ రెడ్డి పాత్ర ఎంతో ఉందని, జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేసిన వ్యక్తి అని తెలిపారు. నిజామాబాద్ లో బిజెపి బీఆర్ఎస్ పొత్తులుగా మారడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి ఓట్లు తక్కువ వచ్చాయని దానిని మేము అంగీకరిస్తున్నామని కానీ ఎన్నికలకు రెండు నెలల ముందే ఓడిపోతానని అనుకున్న అరవింద్ అదృష్టవశాత్తు గెలవడం ద్వారా పిచ్చి లేసి ఏం మాట్లాడాలో తెలియక ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నాడని ,ఖబర్దార్ అరవింద్ ఇంకోసారి కాంగ్రెస్ పార్టీ పైన గాని సుదర్శన్ రెడ్డి పైన గాని అహంకారపు మాటలు మాట్లాడితే ఊరుకునేది లేదని మానాల మోహన్ రెడ్డి హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎవరు కూడా అవినీతికి పాల్పడలేదని సుదర్శన్ రెడ్డి ,మధు యాష్కీ గౌడ్ గౌడ్, జీవన్ రెడ్డి ,షబ్బీర్ అలీ, మహేష్ కుమార్ గౌడ్, భూపతి రెడ్డి అవినీతి ఆరోపణ లేని నాయకులని, ఒక్క మచ్చ కూడా లేని నాయకులని మానాల మోహన్ రెడ్డి అన్నారు. అవినీతి చేసేది అహంకారపు మాటలు మాట్లాడేది ధర్మపురి అరవింద్ అని ,నిజంగా అరవింద్ కు తన నిజాయితీ మీద నమ్మకం ఉంటే ఎన్నికల్లో డబ్బులు పంచడం విషయంలో గానీ, మతం పేరుతో ఓట్లు అడగడంలో కానీ, అభివృద్ధి విషయంలో కానీ చర్చకు రావాలని, చర్చకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్ధంగా ఉన్నారని అరవింద్ సమయాన్ని స్థలాన్ని నిర్ణయించి మాకు తెలపాలని మానాల మోహన్ రెడ్డి అరవింద్ కు సవాల్ చేశారు.ఇంకోసారి కాంగ్రెస్ నాయకులపై గాని, సుదర్శన్ రెడ్డి గారిపై కానీ అహంకారపు మాటలు మాట్లాడితే అసత్యపు ఆరోపణలు చేస్తే బిజెపి నాయకుల బట్టలు ఊడదీసి రోడ్లపై తరిమి కొడతామని మానాల మోహన్ రెడ్డి హెచ్చరించారు. ఈ పత్రిక సమావేశంలో పిసిసి ఉపాధ్యక్షులు రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహేర్ బిన్ హందాన్, పిసిసి ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కేశ వేణు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అంతిరెడ్డి రాజారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, జిల్లా ఎన్ఎస్యుఐ అధ్యక్షులు వేణు రాజ్, రాష్ట్ర ప్రచార కమిటీ మెంబర్ జావిద్ అక్రమ్ ,జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు రాజ నరేందర్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దయాకర్ గౌడ్ ,మీసాల సుధాకర్ రావు, సిరికొండ గంగారెడ్డి, వినయ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి

గ్రూపు -1 ప్రిలిమినరీ

పగడ్బందీగా నిర్వహించాలి

• జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

జూన్ 9న నిర్వహించే గ్రూపు-1 ప్రిలిమినరీ పరీక్ష పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆయన చీఫ్ సూపర్డెంట్లు, బయోమెట్రిక్ శిక్షణ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. బయోమెట్రిక్ చేసే విధానంపై అధికారులతో శిక్షణ ఇప్పించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 12 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 4792 మంది అభ్యర్థులు జిల్లాలో పరీక్ష రాయనున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. బయోమెట్రిక్ యంత్రాలు ఒక రోజు ముందు జిల్లాకు వస్తాయని, వాటిని పరీక్షించి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు పరీక్ష సజావుగా నిర్వహించేందుకు 12 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లను, పర్యవేక్షకులను, రూట్ అధికారులను నియమించినట్లు తెలిపారు. అధికారులకు పరీక్షకు సంబంధించి సామాగ్రిని అందజేశారు. పరీక్ష కేంద్రంలోకి వచ్చే మహిళ, పురుష అభ్యర్థులను తనిఖీ చేయుటకు పోలీస్ శాఖ ద్వారా తగిన ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రమోహన్, పరీక్షల రీజనల్ కోఆర్డినేటర్ విజయ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.



రెంజల్ సొసైటీపై కేసు నమోదు

• మండల వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి

నవతెలంగాణ-రెంజల్

నిత్యావసర వస్తువుల చట్టం కింద రెంజల్ సొసైటీ పై కేసు నమోదు చేసినట్లు రెంజల్ వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి గురువారం తెలిపారు. నిత్యావసర వస్తువుల చట్టం, ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ కింద కేసు నమోదు చేసి జిల్లా కలెక్టర్కు నివేదికను అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈపోపిఓఎస్ మిషన్ ద్వారా ఎరువుల విక్రయాలు జరపడం లేదని, ఈవో పీవోఎస్ మిషన్ స్టాక్‌కి, గ్రౌండ్ స్టాక్ కి వ్యత్యాసం ఉన్నందున, క్యాష్ క్రెడిట్ బిల్లు రైతులకు ఇవ్వకుండా వ్యాపారం నిర్వహిస్తున్నందున ఈ చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

రెంజల్ సొసైటీ పరిధిలోని రెంజల్, సాటాపూర్, సాడ్ బిలోలి గ్రామాలలో రైతుల సౌకర్యార్థం వచ్చినటువంటి స్టాకును అందుబాటులో ఉంచడం వల్ల ఈవో పీవోఎస్ మిషన్ కి, గ్రౌండ్ స్టాక్ వ్యత్యాసం ఉన్నట్లు కనబడుతోంది తప్ప తాము ఎలాంటి అవినీతికి పాల్పడడం లేదని సొసైటీ కార్యదర్శి రాము తెలిపారు. తమ సొసైటీ కి వచ్చినటువంటి స్టాకును ఈ మూడు ప్రదేశాలలో రైతుల సౌకర్యార్థం ఉంచడం జరిగింది తప్ప, అందులో ఎలాంటి పొరపాట్లు జరగలేదని ఆయన పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్టాకు విషయంలో సమగ్ర విచారణ జరిపించి తమకు న్యాయం జరిగేలా చూడాలని సొసైటీ కార్యదర్శి రాము కోరుతున్నారు.

మంత్రాల నెపంతో దాడి

• దుండగులపై కేసు నమోదు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన మన్నె కిష్టయ్యపై మంత్రాల నెపంతో అదే గ్రామానికి చెందిన పేరు సాయిలు కుటుంబీకులు దాడి చేసి గాయపరిచినట్లు బాధితుడు మన్నెకిష్టయ్య గురువారం ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని ఎస్సై మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మనె కిష్టయ్య ఇంటి పక్కన నివసించే పేరు సాయిలు కోడలు అయిన విజయ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఆమె అనారోగ్యానికి కారణం కిష్టయ్య మంత్రాలు చేయడమే అనే అనుమానంతో సాయిలు కుటుంబ సభ్యులైన ప్రశాంత్, ప్రవీణ్, సాయవ, భాస్కర్,రుక్మిణి,విజయ ఏడుగురు కలిసి మన్నె కిష్టయ్య ఇంటి వద్దకు వెళ్లి కిష్టయ్యతో పాటు అతడి కొడుకు, కూతురిపై విచక్షణా రహితంగా దాడి చేశారని ఈ దాడిలో కిష్టయ్యకు తీవ్ర గాయాలు అయినట్లు ఆయన తెలిపారు.మన్నె కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆధునిక ప్రపంచంలో కంప్యూటర్ యుగంలో సైన్స్ పరిజ్ఞానం ఎంత పెరిగిన మూఢనమ్మకాలు తొలి పోవడం లేదని ఇలాంటి ఘటనలు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మహేష్ హెచ్చరించారు.



దాడిలో గాయపడ్డ కిష్టయ్య

స్తంభం పై నుంచి పడి

జూనియర్ లైన్‌మెన్ మృతి

నవతెలంగాణ-నిజాంసాగర్

ప్రమాదవశాత్తు కరెంటు స్తంభంపై నుంచి జారి జూనియర్ లైన్ మెన్ మృతి చెందిన ఘటన మండలంలోని నవోదయ పాఠశాల వద్ద గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సబ్‌స్టేషన్ పరిధిలో అచ్చంపేట్ గ్రామ జూనియర్ లైన్మెన్‌గా నిధులు నిర్వహిస్తున్న భిక్కనూర్ మండలం పెద్ద మల్లారెడ్డి గ్రామ నివాసి సంతోష్ రోజువారి విధుల్లో భాగంగా గురువారం ఉదయం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో ఎల్సి తీసుకొని జవహర్ నవోదయ విద్యాలయం వద్ద స్తంభంపై మరమ్మత్తులు చేపట్టాడు. ఆ సమయంలో స్తంభంపై నుంచి ప్రమాదవశాత్తు జారి పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గత ఆరు సంవత్సరాలుగా నిజాంసాగర్ మండలంలో జూనియర్ లైన్మెన్‌గా నిధులు నిర్వహిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. జూనియర్ లైన్ మెన్ మృతిపట్ల విద్యుత్‌శాఖ సిబ్బంది సంతాపం వ్యక్తం చేసి నివాళి అర్పించారు.



మృతి చెందిన సంతోష్

ప్రైవేట్ ఆస్పత్రులు తనిఖీ


సంజీవని హాస్పిటల్ తనిఖీ చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-కోటగిరి

ప్రైవేట్ ఆసుపత్రులు, ఆర్ఎంపి, పిఎంపి క్లినిక్స్‌ను కోటగిరిలో గురువారం జిల్లా వైద్య శాఖ అధికారి ఆదేశాల మేరకు పీహెచ్‌సి వైద్యాధికారి కరణ్ , ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలసి కోటగిరి మండల కేంద్రంలో గల సంజీవని హాస్పిటల్ సందర్శించారు. తనిఖీలు నిర్వహించి, సమాచారం సేకరించారు. నిబంధన ల ప్రకారం నడుచుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది సూపర్వైజర్ జ్యోతి , ఏఎన్ఎం శ్రీదేవి, ఆశ అనిత పాల్గొన్నారు.

ఎడపల్లి మండలంలో భారీ వర్షం


భారీగా కురుస్తున్న వర్షం

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలో గురువారం కురిసిన భారీ వర్షానికి చిరు వ్యాపారులు ఆవేదనకు గురైయ్యారు. రైతులు మాత్రం హర్షం వ్యక్తం చేశారు. గత వారం నుండి ఎండలు మెండుగా ఉండడంతో చిన్నారులు వద్ధులు, యువకులు, మహిళలు, ఎండ వేడిమి తట్టుకోలేక ఇండ్లలో తలలు దాచుకున్నారు. ఏది ఏమైనప్పటికీ వర్షానికి ఎండనుంచి ఉపశమనం లభించడంతో ప్రజలు వర్షం వ్యక్తం చేశారు.

సీఎంకు శుభాకాంక్షలు తెలిపిన గోర్త రాజేందర్


సీఎం కు పుష్ప గుచ్ఛం అందజేస్తున్న గోర్త రాజేంధర్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

పార్లమెంట్ ఎలక్షన్ తర్వాత ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ని నిజామాబాద్ ఉమ్మడిజిల్లా మాజీ సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు గోర్త రాజేందర్ గురువారం కలిశారు. ఈసందర్భంగా సీఎంకు పుష్ప గుచ్ఛం ఇచ్చి శు భాకాంక్షలు తెలిపారు.

వ్యవసాయ బోర్ల వద్ద దొంగతనాలు

- కేబుల్ స్టార్టర్ల దొంగిలిస్తున్న దుండగులు
- పోలీస్ శాఖ ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయాలి


పగులగొట్టిన కరెంటు డబ్బా

నవతెలంగాణ-రెంజల్

మండలంలో వారం రోజులుగా రైతన్నలు దుక్కులు దున్ని నారుమళ్ళను సిద్ధం చేస్తున్న తరుణంలో కేబుల్, స్టార్టర్లు, ఆటోమెటిక్ దొంగిలిస్తూ రైతులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల ంలోని కిసాన్ తండ గ్రామానికి చెందిన పీర్ సింగ్ వ్యవసాయ బోరుబావి నుంచి సుమారు 150 మీటర్ల కేబుల్ వైర్లు దొంగిలించాలని ఆయన తెలిపారు. మండలంలోని వీరన్న గుట్ట గ్రామంలోని వీరేశం, చిన్న రాజ్యంకు సంబంధించిన స్టార్టర్లను దొంగిలించారు. స్థానిక పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దుండగులను అదుపులోకి తీసుకోవాలని కోరుతున్నారు. గత పది రోజులుగా వ్యవసాయ బోరు బావుల వద్ద దొంగతనాలు జరుగుతూ ఉండడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసు అధికారులు వీటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తమకు రక్షణగా నిలవాలని రైతులు కోరుతున్నారు.

ఏకరూప దుస్తుల ప్రదర్శన


ఏకరూప దుస్తులను ప్రదర్శిస్తున్న ఎంపీడీవో, తదితరులు

నవతెలంగాణ-ముప్కాల్

జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ "జిల్లా డీఆర్డీఏ" నిజామాబాద్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రానికి చెందిన (ఐకేపీ) మహిళ శక్తి సమాఖ్య ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఏకరూప దుస్తులు ప్రదర్శించారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంను సైతం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మహమ్మద్ ముజాఫరోద్దీన్ మాట్లాడుతూ.. మండలంలోని 14 ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అభ్యసిస్తున్న 1,164 మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులను కుట్టడం జరిగిందని అన్నారు. ఈయూనిఫాంలను ప్రధానోపాధ్యా యులకు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహమ్మద్ ముజాఫరోద్దీన్, ఏపీఎం ప్రసాద్ రావ్, ముప్కాల్ ప్రభుత్వ జిల్లా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగారాం, ఐకేపీ సీసీ ప్రణీత, వివోఏలు అరుణ, కావ్య, రాధిక, అర్చన, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో ఫీజుల వివరాలు డిస్‌ప్లే చెయ్యాలి

- ఏఐపీఎస్‌యూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కళాశాలలో ఫీజుల వివరాలు డిస్‌ప్లే చెయ్యాలని ఏఐపిఎస్‌యూ జిల్లా బాధ్యులు బోడ అనిల్ అన్నారు. భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఏఐపిఎస్‌యూ) ఆధ్వర్యంలో ఫీజు వివరాలు డిస్‌ప్లే చెయ్యాలని డిఐఇఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐపిఎస్‌యూ జిల్లా బాధ్యులు బోడ అనిల్ మాట్లాడుతూ.. ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలల్లో పిఆర్ఓల ద్వారా విద్యార్థుల తల్లి దండ్రులను మాయమాటలతో గారడిచేసి అడ్మిషన్లు చేసుకున్న తరువాత అధికంగా ఫీజు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఫీజు వివరాలు డిస్‌ప్లే చెయ్యని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. దీంతోపాటు మెటీరియల్ (బుక్స్) తప్పకుండా తీసుకోవాలని అంటు రక రకాలుగా అదనంగా వసూలు చేస్తున్నాయని తెలిపారు. చివరికి అడ్మిషన్ చేయించిన పీఆర్ఓ దొరకక చెప్పిన ఫీజు కట్టి సర్టిఫికెట్ తీసుకెళ్ళే పరిస్థితి నెలకొందని, ఈ విదంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యసంస్థలు విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. ఇటువంటి విద్యాసంస్థలపై చర్య తీసుకోవాలని డిఐఇఓను కోరారు. కార్యక్రమంలో బల్ భీమ్, అంకోష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


మెండోర:బుస్సాపూర్‌లో..


బాల్కొండలో..


భీంగల్‌లో..

జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జయశంకర్ బడిబాట కార్యక్రమం గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఈనెల 19 వరకు జరగనుంది. బడి ఈడు పిల్లలను, బాల కార్మికులను గుర్తించి బడిలో చేర్చడం, ప్రైమరీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచటంకోసం మహిళా సంఘాల సహాయంతో పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు.

- బడిబాట ప్రారంభం

నవతెలంగాణ-విలేకరుల బృందం

కమ్మర్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో అందించే సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి ఆంధ్రయ్య అన్నారు.గురువారం ప్రొఫెసర్ జయ శంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని చౌట్ పల్లి బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ బడి బాట ప్రాముఖ్యతను వివరించారు. బడి ఈడు పిల్లలను, బడి బయట పిల్లలను, బడి మధ్యలో మానేసిన పిల్లలను బడిలో చేర్పించడం, అసలు పాఠశాలకు వెళ్ళని పిల్లలు లేకుండా చూడడం మన భాధ్యత అన్నారు. ప్రభుత్వం ఈనాడు విద్యార్థుల కోసం పాఠశాలల్లో ఎన్నో సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, మధ్యాహ్నభోజనం, ఉదయం అల్పాహారం అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ మంచిగా చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు అన్నారు. అనంతరం గ్రామంలో బడి ఈడు పిల్లల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. కార్యక్రమంలో బాలికల పాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజాదా?న్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మి నర్సయ్య గ్రామ సమైఖ్య అధ్యక్షురాలు కమల, పంచాయతీ కార్యదర్శి గంగా జమున, అంగన్వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు కే.శ్రీనివాస్, బంతిలాల్, ఎ. శ్రీనివాస్, రాజు, ప్రవళిక, హేమలత, గీత, సంతోష్, సిఆర్‌పి లు పెద్ద అంజయ్య, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని నాలేశ్వర్ మాజీ సర్పంచ్ సరిన్ అన్నారు. నాలేశ్వర్ గ్రామంలో బడిబాట కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా తల్లిదండ్రులతో పాటు ఉపాధి హామీ కూలీలతో గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. నాలేశ్వర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో విద్యతో పాటు సాంకేతిక విద్య, ఉచిత యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం పథకంతో పాటు అనేక సంక్షేమ, క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాబట్టి తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో విడిసి సభ్యులు,ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, రాజేందర్, ఉపాధ్యాయులు సాగర్, శ్రీనివాస్, గంగాధర్, సంజీవ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: మండలంలోని దూపల్లి గ్రామంలో గురువారం మండల విద్యాశాఖ అధికారి గణేష్ రావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. గ్రామంలోని ఉపాధ్యాయులందరూ ఇంటింటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం జరిగిందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పిఆర్‌టియూ మండల అధ్యక్ష కార్యదర్శులు సోమలింగం గౌడ్, సాయి రెడ్డి, దూపల్లి పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు కే సాయన్న, శ్రీనివాస్, శ్రీధర్, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షులు సాయి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

మెండోర: బడిబాట కార్యక్రమంలో భాగంగా బుస్సాపూర్ గ్రామంలో ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను అభ్యర్థించారు. కరపత్రాలు పంపిణీ చేసి ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న విద్య , మౌలిక వసతులను వివరించారు. పాఠశాలలో విద్యార్థులను చేర్పించి పేర్లను నమోదు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఓ.రమేష్, ఉపాధ్యాయినులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

భీంగల్ : పట్టణ కేంద్రంలోని బోయగల్లిలోగల బాలికల ఉన్నత పాఠశాలలో జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ప్రతి గడపగడపకు తిరుగుతూ ప్రభుత్వ విద్య ఆవశ్యకతను తల్లిదండ్రులకు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత సౌకర్యాలు కల్పిస్తూ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను అందిస్తుందని కనుక పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘు వాస్, రాములు, వాసుదేవ్, భాగ్యలక్ష్మి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా రూపొందించిన బడిబాట కార్యక్రమం గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో బడికి వెళ్లవలసిన పిల్లలను, బడి మానేసిన పిల్లలను పాఠశాలల్లో చేర్పిస్తామని మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ తెలిపారు. జూన్ 6 నుంచి 19 వరకు చేపడుతున్న బడిబాట కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, మండల స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాలు, విలేజ్ ఆర్గనైజేషన్లు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. బడిబాట కార్యక్రమం ఒక ప్రణాళిక బద్ధంగా ముందుకు కొనసాగుతుందని ఎంఈఓ తెలిపారు. ఈ నెల 6న బడిబాట కార్యక్రమంపై విలేజ్ ఆర్గనైజేషన్‌లతో సమావేశం. 7న ఇంటింటికీ తిరిగి బడీడు పిల్లలను గుర్తించడం. 8 నుంచి 10వరకు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి తల్లిదండ్రుల్లో చదువుపై అవగాహన కల్పిస్తూ పిల్లలను బడికి పంపేలా కార్యక్రమాలు నిర్వహిస్తారు. 11న గ్రామసభ ఏర్పాటు చేసి 3నుంచి 10వరకు చేపట్టిన కార్యక్రమాలపై చర్చిస్తారు. 12న పండుగ వాతావరణంలో పాఠశాలలను పున్నప్రారంభించి నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతారు. 13న తొలిమెట్టు, 14న సామూహిక అక్షరాభ్యాసం, 15న గర్ల్‌చైల్డ్ ఎడ్యుకేషన్, 18న డిజిటల్ తరగతులపై అవగాహన, 19న ఆటల పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే అన్ని వసతులు కార్పొరేట్‌కు దీటుగా అన్నిరకాల వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు ఆకర్షితులు కావొద్దని, ప్రభుత్వం ప్రతి పేదింటి బిడ్డకూ కార్పొరేట్ విద్యను అందించాలనే లక్ష్యంతో పని చేస్తున్నదన్నారు. గ్రామీణ స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అందరి సహకారంతో బడిబాటను విజయవంతం చేస్తామని ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో పిఆర్టియు మండల నాయకులు శ్రీనివాస్, పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, ఏపీఎం గంగాధర్, మహిళా సమాఖ్యల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


జక్రాన్‌పల్లి: తొర్లికొండలో..

జక్రాన్‌పల్లి: పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాని ఎంఈఓ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని తొర్లికొండ ఉన్నత పాఠశాలలో బడిబాటలో భాగంగా గ్రామస్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అంగన్వాడీ టీచర్స్ ఆశా వర్కర్స్ ఐకెపి సిబ్బంది, బిడిసి సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బడిబాట యొక్క కరపత్రాలను పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జంగం అశోక్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయ బందం, అంగన్వాడీ ఉపాధ్యాయులు, వీడిసి సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎడపల్లి: మండలంలో బడిబాట కార్యక్రమం సందర్భంగా ఎడపల్లి పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు మీడియం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామంలోని బడిఈడు పిల్లల బాల, బాలికల తల్లిదండ్రులను కలిసి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాయిలు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, బాల, బాలిక తల్లిదండ్రులు పాల్గొన్నారు. మండలంలోని ఏఆర్‌పి క్యాంపులో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ ఆధ్వర్యంలో బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

బోధన్: ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబయట పిల్లలను గుర్తించడానికి కాలనీలకు వెళ్లి ఇంటింటికి తిరుగుతూ విద్యార్థులను నమోదు చేసుకున్నారు. బోధన్ పట్టణంలోని రాకాసిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ) హైస్కూల్ ఉపాధ్యాయులు బడిబాటలో భాగంగా సందర్శించి 6వ తరగతిలో 39 మంది విద్యార్థులను చేర్పించడానికి నమోదు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నగేష్ బాబు, రాజేశ్వర్ పాల్గొన్నారు.

మందర్న గ్రామంలో....

సాలూర మండలం మంధర్న గ్రామంలో ఉపాధ్యాయులు గ్రామ మహిళ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి బడిబాటపై చర్చించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేఖ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


రెంజల్:


బోధన్‌లో..


నవీపేట్ : నాళేశ్వర్‌లో..


కమ్మర్‌పల్లి:మాట్లాడుతున్న ఎంఈవో


ఎడపల్లిలో..

సామాజిక తనిఖీ పకడ్బందీగా నిర్వహించాలి

- ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్


మాట్లాడుతున్న ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలో సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈనెల 7వ తేదీ నుండి 18వ తేదీ వరకు మండలంలోని ఆయా గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై నిర్వహించే సామాజిక తనిఖీ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో 2023-24 సంవత్సరానికి గాను నిర్వహించే సామాజిక తనిఖీపై సామాజిక తనిఖీ బందం సభ్యులకు, పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈనెల 7 నుండి 18 వరకు 2023- 24 సంవత్సరానికి గాను మండలంలోని ఆయా గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ.6కోట్ల 72లక్షల 7వేలతో వివిధ పనులు జరిగినట్లు తెలిపారు. ఇందులో రూ. 3 కోట్ల 10 లక్షల 77వేల వేజ్ పేమెంట్, రూ.3 కోట్ల 36 లక్షల 97వేల మెటీరియల్ పేమెంట్లు జరిగినట్లు ఆయన వివరించారు.గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై, కూలీలకు చెల్లించిన డబ్బులపై సామాజిక తనిఖీ బందం సభ్యులు పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా నిక్కచ్చిగా సామాజిక తనిఖీ జరగాలని ఆయన ఆ సిబ్బందికి సూచించారు. తనిఖీ సందర్భంగా గ్రామాల్లో జరిగిన పనుల వివరాలను, చెల్లించిన మొత్తంలో ఏమైనా తేడాలు ఉంటే సమగ్రంగా రికార్డుల్లో పొందుపరచాలన్నారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి సదాశివ్, ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, ఎస్ ఆర్ పి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

సోయా విత్తనాల విక్రయం

- బాసర రకం 8 కిలోల బ్యాగు రూ.650

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలో ఎఫ్‌పిఓ రైతు సంఘం ద్వారా వానాకాలం పంట సాగు కోసం సోయా విత్తనాలు బాసర రకం 8కిలోల బ్యాగులను అమ్మకాన్ని గురువారం ఎఫ్‌పిఓ సంఘం చైర్మన్ చాట్ల గోపాల్ మండల వ్యవసాయ అధికారి రాజు, ఎఫ్‌పిఓ సభ్యులు కలిసి ప్రారంభించారు. ఈ ఏడాది కొత్తరకం సోయా విత్తనాలు 8కిలోల బ్యాగులు రావడం అవసరం గల రైతులు సరైన ధరలతో తీసుకు వెళ్లడానికి సౌకర్యంగా ఉంటుందని వానాకాలం పంట సాగులో భాగంగా రైతులు బాసర రకం విత్తనాలు సాగు కోసం తీసుకువెళ్లాలని సంఘం చైర్మన్ మండల వ్యవసాయ అధికారి కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.


విత్తనాల విక్రయం ప్రారంభం

పాఠ్యపుస్తకాలు అందజేత

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో 2024-25కు సంబంధించిన పాఠ్యపుస్తకాలను సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు జెడ్పిటిసి శంకర్ నాయక్, ఎంపీపీ రాధా బలరాం, ఎంపీటీసీ తూర్పు రాజులు, ఎంపీటీసీ పత్తి శ్రీను, ఆఫ్షన్ ముస్తఫా, డైరెక్టర్ మోతిలాల్, స్థానిక పట్టణ అధ్యక్షుడు సంఘం బాబా, చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిటిసి తూర్పు రాజులు మాట్లాడుతూ.. గ్రామీణ పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని సకాలంలో పాఠ్యపుస్తకాలు అందిస్తున్నందుకు ప్రభుత్వనికి ధన్యవాదాలు తెలిపారు.


నోట్‌పుస్తకాలు అందజేత

ప్రభుత్వ స్కూళ్లల్లోనే ఉచితంగా నాణ్యమైన విద్య

- సకల సౌకర్యాలతో విద్యాబోధన
- విద్యార్థులు వినియోగించుకోవాలి
- బడిఈడు పిల్లలు బడిబయట ఉండొద్దు
- బడిబాటలో ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖాధికారులు

నవతెలంగాణ-విలేకరులబృందం

ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య ఉచితంగా లభిస్తుందని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లల్లో సకల సౌకర్యాలు ప్రభుత్వం కల్పించిందని, క్వాలిఫైడ్ టీచర్‌లతో విద్యాబోధన అందించనున్నట్టు తెలిపారు. కావున విద్యారులు, విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బడిఈడు పిల్లలు బడి బయట ఉండొద్దని, స్కూళ్లల్లో చేరి చదువుకోవాలని అన్నారు. జయశంకర్ బడిబాట కార్యక్రమం గురువారం జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా బడిమానేసిన పిల్లలను గుర్తించేందుకు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

పిట్లం : బడి ఈడు విద్యార్థులు బడి బయట ఉండరాదని ఉపాధ్యాయులు హనుమ గౌడ్ , శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ , చిన్న కొడప్ గల్ ఉన్నత పాఠశాలల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా బడి ఈడు విద్యార్థుల ఇండ్లతోపాటు బడి మానేసిన విద్యార్థుల ఇండ్లను సందర్శించి ఎవ్వరూ కూడా బడి బయట ఉండరాదని పాఠశాల లోని ఉండాలని సూచించారు. ప్రభుత్వ బడులలో అందించే ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధ్యాయ బృందం బడిబాట ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రూప్ సింగ్ , వి. శ్రీనివాస్, బన్సీలాల్ , హట్టి సింగ్ , కిష్టయ్య , కృష్ణంరాజు , రామకృష్ణ , లలిత, అరుణ, సవెంత భాయి , సి ఆర్ పి హైమద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ : దోమకొండ మండల కేంద్రం లోని బాలుర ఉన్నత పాఠశాల దోమకొండలో నేడు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "బడిబాట' లో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధ లక్ష్మి ఉపాధ్యాయ బృందం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బడి బాట కార్యక్రమం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రాధ లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బడి బాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ప్రతి ఒక్కరు తమ పిల్లల ను ప్రభుత్వ పాఠశాలలో నే చేర్పించాలని కోరారు. బడి బయట ఉన్న పిల్లలను మరియు ఇతర ఆవాస ప్రాంతాలు ఉన్న పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చదివే పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని తీర్మానం చేకశారు. అనంతరం బడిబాట కార్యక్రమం పై ప్రతిజ్ఞను చేశారు. 10వ తరగతి పరీక్ష ఫలితాలు 100 శాతం సాధించడమే కాకుండా 10 జీపీఏ సాధించిన శ్రీశాంత్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు.


పెద్దకొడప్‌గల్‌లో చిన్నారులను బడిలో చేర్పిం


దోమకొండలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంపే లక్ష్యం

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. సర్కారు బడులను ప్రభుత్వం బలోపేతం చేసిందని ఇందులో భాగంగానే ఏటా మాదిరిగానే ఈసారి కూడా పాఠశాలలు పున. ప్రారంభానికి ముందుగా బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నట్టు ఉపాధ్యాయులు తెలిపారు. చిన్నారులను ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో 1వ తరగతిలో, 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను 6వ తరగతిలో చేర్పించేలా ప్రణాళికలు ప్రచారం చేపడుతు న్నట్టు తెలిపారు. అంగన్ వాడిల్లో ఉన్న పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించేలా కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు చంద్రకాంత్, కిషన్, బస్వరాజ్, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రామారెడ్డి : మండలంలో ఆయా గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని ఆయా గ్రామాల ఉపాధ్యాయులు గురువారం ప్రారంభించారు. గ్రామంలో బడి ఈడు పిల్లలను బడిలో చేర్చాలని తల్లిదండ్రులకు సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమావేశమై బడి ఈడు పిల్లలతో పాటు, బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వివో లు తదితరులు పాల్గొన్నారు.



పిట్లంలో, రామారెడ్డిలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వీవోలు

రైతులకు అవసరమైన స్పీక్ డీఏపీ కరువు

నవతెలంగాణ-మద్నూర్

మండల రైతులు అత్యధికంగా నమ్మకంగా పంట సాగు కోసం స్పీక్ డిఏపి మందులనే వాడుతారు. అలాంటి మందు మండలంలో కరువైంది. వానాకాలం పంట సాగు కోసం మండల రైతులు విత్తనాలు, ఎరువుల కోసం ప్రైవేటుపరంగా కొనుగోలు చేస్తున్నారు. ఫర్టిలైజర్ ఫెస్టిలైజర్ సీడ్ అమ్మకందారులు రైతులు కోరే స్పీక్ డిఏపి లేదనే చెప్తున్నారు. ఏదేదో కంపెనీలు అలాంటి డిఏపీలు ఉన్నట్టు చెప్పడం అలాంటి కొత్త రకం మందులను రైతులు కొనాలంటే ఆసక్తి చూపకపోయినప్పటికీ దిక్కుతోచని స్థితిలో కొత్తరకం డిఏపి మందులను కొనుగోలు చేయాల్సి వస్తుంది. ఈ విషయాన్ని నవ తెలంగాణ మండల వ్యవసాయ అధికారికి వివరణ కోరగా పైన కొరత ఉన్నట్టు లభించడం లేదని సమాధానం ఇచ్చారు. ఈ ఏడాది ఎందుకు ఇంత స్పీక్ డిఏపి కొరతా ఉంటుందని అడగగా పైనుంచే రావడంలేదని రైతుల కోరిక మేరకు స్పీక్ డిఏపి దిగుమతి అయ్యేలా చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి తెలిపారు.

8న లోక్ అదాలత్

వినియోగించుకోవాలి : ఎస్ఐ బొజ్జ మహేష్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



ఈ నెల 8వ తారీఖున నిర్వహించే లోక్అదాలత్ కార్యక్రమాన్ని ఎల్లారెడ్డి మండలంలోని కక్షిదారులు సద్వినియోగం చేసుకొని, సమస్యను పరిష్కరించుకోవాలని ఎస్ఐ మహేష్ సూచించారు. గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కక్షిదారులు రాజీకి ఆమోద యోగ్యమైన క్రిమినల్, సివిల్, వివాహ, కుటుంబాల తగాదాలు, రోడ్డు ప్రమాదాలు, చిట్ ఫండ్స్, ఎలక్ట్రిసిటీ, ట్రాఫిక్ కేసులు ఇతర కేసులపై లోక్అదాలత్ వేదిక ద్వారా పరిష్కరించుకోవాలని ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ విముక్తి చెందాలంటే రాజీ మార్గం ఎన్నుకోవాల్సిదేనని వారు తెలిపారు. కక్షిదారులు రాజీని కుదుర్చుకొని మండలంలో నేర రాహిత మండలంగా తీర్చిదిద్దాలని మండల ప్రజలకు ఎస్ఐ మహేష్ విజ్ఞప్తి చేశారు.

యూనిఫాంల కుట్టుకేంద్రం పరిశీలన


యూనిఫాం కుట్టు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-జుక్కల్

ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం యూనిఫాంలు కుట్టిస్తున్న విషయం విధితమే. మండల పరిషత్ అధికారి శ్రీనివాస్‌కు గురువారం పరిశీలించారు. కుట్టు కేంద్రాలను పరిశీలించి ఎంత వరకు పూర్తి చేశారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిడివో శ్రీనివాస్ మాట్లాడుతూ మండల ఐకేపిలో కుట్టు శిక్షణ పొందిన వారికి ఉపాధి కల్పించాలని ప్రభుత్వం విద్యార్థుల డ్రెస్‌లను వారికి కాంట్రాక్ట్ ఇచ్చినట్టు తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుంచి విద్యాసంస్థలు పున: ప్రారంభం కానున్న నేపథ్యంలో సకాలంలో విద్యార్థులకు అందించేందుకు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఐకేపి ఏపీఎం సత్యనారాయణతో కలిసి వివరాలు సేకరించి క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టినట్టు తెలిపారు.

సురేష్ షెట్కార్‌కు సన్మానం


ఎంపీని సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-భిక్కనూర్

కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం స్థానం నుండి పోటీ చేసి బిజెపి అభ్యర్థి బీబీ పాటిల్ పై భారీ మెజారిటీతో గెలుపొందిన సురేష్ షెట్కార్ ను హైదరాబాదులోని ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ నివాసంలో టి పి సి సి రాష్ట్ర కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సురేష్ షెట్కార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకు కృషి చేసిన ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ నాయకుడికి, కార్యకర్తకు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, మల్లు పల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, రామ్ రెడ్డి, సిద్ధారెడ్డి, బాపురెడ్డి, సిద్దయ్య, పోచయ్య, కిషన్, జంగంపల్లి మాజీ సర్పంచ్ నర్సింలు యాదవ్, మాజీ ఎంపీటీసీ రామస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సొసైటీలలో అందుబాటులో టార్పాలిన్లు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలో తాండూర్ మాల్ తుమ్మెద సొసైటీల పరిధిలో టార్పాలిన్‌లు అందుబాటులో ఉన్నట్లు సీఈఓ లు జైపాల్ రెడ్డి పవన్ తెలిపారు. ఒక్కోటి 1400 రూపాయలకు విక్రయిస్తున్నట్లు వారు తెలిపారు. అవసరం ఉన్నారు వారు ఆయా సొసైటీలలో సంప్రదించాలని వారు పేర్కొన్నారు.


సొసైటీకి వచ్చిన టార్పాలిన్‌లు

బోరుబావి గుంతలో పడిన ఆవు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలం లోని పోతాయపల్లి గ్రామంలో గురువారం బోరు బావిలో గుంతలో ఆవు పడి విలవిల కొట్టుకుంది. గమనించిన స్థానికులు అతికష్టమీద ఆవును బయటకు తీశారు. గ్రామానికి చెందిన ఒక రైతు తన వ్యవసాయ పంట పొలంలో సాగునీటి కోసం బోరును తవ్వించారు. నీళ్లు రాకపోవడంతో సదరు రైతు కేసింగ్‌ను తీసి బోరు గుంతపూర్చ కుండా వదిలేశారు. గురువారం పోతాయిపల్లి గ్రామానికి చెందిన పశువులు పంట పొలాల్లో మేత కోసం వెళ్లాయి ఆవు మేతమేసుకుంటూ వెళుతున్న క్రమంలో బుధవారం కురిసిన వర్షానికి బోరు గుంత నీటితో నిండిపోయింది. ఆవు నడుచుకుంటూ వెళ్లి గుంతలో పడింది. విలవిలా కొట్టుకుంటుంది. ఇది గమనించిన గ్రామస్తులు అక్కడికి చేరుకొని తాళ్లు కట్టి బయటకు తీశారు. ఆవు యజమాని ఊపిరి పీల్చుకున్నాడు. సదరు రైతు బోరు తవ్వించి గుంత పుడ్చో పోవడంతో ఈ ప్రమాదం జరిగిందని మనుషులు వెళితే ప్రమాదం జరిగి ఉండేదని సదరు రైతుపై గ్రామస్తుల మండిపడుతున్నారు. ప్రభుత్వం ఒకవైపు బోరు తవ్విన నీళు పడకపోవడంతోవెంటనే గుంతను పూడ్చేయాలని ఆదేశాలు జారీ చేసిన కొంతమంది ఆదేశాలను ఖాతా చేయడం లేదన్నారు.


బోరుబావి గుంత నుంచి ఆవును వెలికితీస్తున్న స్థానికులు

చలో కలెక్టరేట్ కరపత్రాల విడుదల

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామల ఐలన్న పిలుపు మేరకు ఈనెల 10వ తారీఖు నాడు ఉదయం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్లకు వినతిపత్రం అందించాలని తలపెట్టిన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను గురువారం నాడు ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో బి.ఎన్.ఆర్ కె ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్లు సాయిబాబా ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మీసేవ సభ్యత్వం రద్దు చేయాలని, వెల్ఫేర్ బోర్డు నుండి బోగస్ కార్డులు రద్దు చేయాలని, బోర్డులో భవన నిర్మాణ కార్మికున్ని చైర్మన్ గా నియమించాలని, 2009 నుండి సభ్యత్వం ఉన్న కార్మికుని ఆన్లైన్ చేయాలని డిమాండ్ చేశారు. తదితర కార్మికుల డిమాండ్ల సాధన కోసం కార్మికులంతా కలిసి కట్టుగా జూన్ 10వ తారీఖు నాడు బైక్ ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని వినతి పత్రం అందించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మండల భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలి

- ఎంపీడీవోకు విన్నపించిన యువకులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట మేజర్ గ్రామ పంచాయతీలో రోజురోజుకు సమస్యలు తలెత్తుతున్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని గురువారం ఎంపీడీవో నరేష్ వద్దకు గ్రామానికి చెందిన యువకులు వెళ్లి సమస్యలను వివరించారు. లింగంపేట్ మేజర్ గ్రామపంచాయతీలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుడడంతో పారిశుధ్యం పూర్తిగా లోపించిందన్నారు. మురికి కాలువలలో చెత్తా చెదారం పేరుకుపోయి మురికినీరు రోడ్లపై వస్తున్నా యని వర్షాకాలం సమీపించడంతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశాలు ఉందని వారి వివరించారు. అంతేకాకుండా రోడ్లపై వ్యాపారులు వ్యర్థ పదార్థాలతో పాటు చెత్తాచెదారం వేస్తున్నారని అన్నారు. గ్రామ పంచయతీ ట్రాక్టర్ గ్రామంలో తిరగకపోవడంతో చెత్తను తీసుకెళ్లి డంపింగ్ యార్డ్‌లోకి తరలించాల్సి ఉండగా గ్రామపంచాయతీ వద్దనే ట్రాక్టర్ పరిమితమైందన్నారు. కొందరు వ్యాపారులు చెత్తను రోడ్డుపై వేస్తున్నారని క్రీడా ప్రాంగణం సమీపంలో వ్యర్థపదార్థాలు చెత్తను వేస్తున్నాన న్నారు. అంతే కాకుండా విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయని ఈదురు గాలులు బలంగా వీస్తే స్తంభాలు కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. వాటి స్థానంలో నూతన స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. మార్పు కోసం యువత అనే నినాదంతో ప్రతిరోజు మురికి కాలువల చెత్త మురికిని తీసివేస్తున్నామన్నారు. అంతే కాకుండా మురికి ఇరువైపులు ఉన్న పిచ్చి మొక్కలను తొలగిస్తున్నా మన్నారు. దీంతో ఎంపీడీవో సానుకూలంగా స్పందించి చెత్త టాక్టర్ ఏర్పాటు చేస్తానని గ్రామంలో నెలకొన్నటువంటి ప్రధాన సమస్యలను పరిష్కరిస్తానని పారిశుధ్యంలోకిచకుండా జాగ్రత్తలు తీసుకుంటామని పేరుకపోయినటువంటి పూడికతను తీపించే ఏర్పాట్లు చేస్తామని యువకులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బొల్లారం క్రాంతి, రాజారాం, బాలరాజు, వంశీ, శీను, దిలీప్, శశి, దాసరి, అనిల్ శివ తదితరులున్నారు.


ఎంపీడీవోను కలిసి మాట్లాడుతున్న యువకులు

ఇచ్చిన హామీలు నెరవేర్చుతాం

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్


మాట్లాడుతున్న శ్రీధర్‌గౌడ్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

పది సంవత్సరాల తర్వాత జహీరాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం హర్షనీయ మని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చే పార్టీ అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాల తర్వాత జహీరాబాద్ గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం హర్షనియమని అన్నారు. గతంలో రాష్ట్రంలో మూడు ఎంపీలుండగా నేడు 8 ఎంపీ సీట్లు సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. జహీరాబాద్ ప్రజలు 46 వేల మెజారిటీతో సురేష్ షెట్కర్‌ను గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎంపీ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు క్రాస్ ఓటింగ్ పాల్పడి బిజెపికి ఓట్లు వేయించినా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ గెలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరేలా చూస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు రెడ్డి, విఠల్ రెడ్డి, బోయినీ విటల్, గంగారెడ్డి, నరసింహారెడ్డి, ఇమామ్, దివిటికిష్టయ్య, సురేందర్ గౌడ్, శ్రీరామ్ గౌడ్, బాలరెడ్డి, పర్వత రావు, షాహిద్ పాషా, గణేష్, సాయ గౌడ్, కుమార్, నారాయణ రెడ్డి, సుధాకర్, హనుమాన్లు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలి

ప్రజలకు అవగాహన కల్పించాలి


కార్యక్రమంలో పాల్గొన్న ఆశాలు

నవతెలంగాణ-భిక్కనూర్

వర్షాకాలం మొదలైన సందర్భంగా సీజనల్ వ్యాధులపై ప్రజలు జాగ్రత్త వహించే విధంగా తగు సూచనలు, సలహాలు ప్రజలకు వివరించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు యేమిమా తెలిపారు. గురువారం భిక్కనూర్ పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో కుటుంబ నియంత్రణ పద్ధతులు, తాత్కాలిక పద్ధతులు, సీజనల్ వ్యాధులు వర్షాలు పడిన వెంటనే మలేరియా , డెంగ్యూ మొదలగు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న కారణంగా నీరు నిలవకుండా ప్రతి ఇంటిని సందర్శించి జ్వర పీడితులను తొందరగా గుర్తించి చికిత్స అందించాలని తెలిపారు. గర్భిణీ స్త్రీలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డెలివరీ కోసం వచ్చే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి వెంకటరమణ, ఫార్మసిస్ట్ వెంకటేశ్వర్లు, ల్యాబ్ టెక్నీషియన్ లతీఫ్, స్టాఫ్ నర్స్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త బస్టాండ్ వద్ద స్పెషల్ డ్రైవ్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద గురువారం సాయంత్రం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వివేకానందరెడ్డి, స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవికుమార్, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. త్రిబుల్ రైడింగ్, సరైన వాహన ధ్రువపత్రాలు లేనివారికి, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేసే వారికి, సెల్ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే వారికి ఆటోలలో పరిమితికి మించి తీసుకెళ్లే వారికి జరిమానాలు విధించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ ఓడి రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

పిడుగుపాటుకు గేదె మృతి

నవతెలంగాణ-బోధన్

మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో గురువారం ఈదురు గాలులతో కురిసిన వర్షంపడింది. ఈసమయంలో పిడుగు పడి గ్రామానికి చెందిన ధాత్రిక రమేష్ అనే నిరుపేద పాడి రైతుకు చెందిన గేదె మేతకు వెళ్లి మృతి చెందింది. గేదె పాలు విక్రయించి, కూలి పని చేస్తూ బతుకుతున్న కుటుంబానికి జీవనాధారమైన గేదె మృతి చెందడంతో ఆయన రోదించారు. అధికారులు తన ఆదుకోవాలని వేడుకున్నారు.



కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావుకు నివాళి



నివాళ్లు అర్పిస్తున్న సిపిఐ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సిపిఐ జిల్లా కార్యాలయంలో కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 110వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర సమరయోధులు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు 28 సంవత్సరాల పాటు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా చంద్ర రాజేశ్వరరావు పనిచేశారని అన్నారు. ఆయనకు ఉన్న వందల ఎకరాల భూమిని పేదలకు పంచడం జరిగిందన్నారు. చివరికి సొంత ఆస్తులు లేకపోయినా పార్టీ కార్యాలయంలోనే ఉంటూ జీవనం కొనసాగించారని తెలిపారు. ఆయన ఆశయ సాధన సమ సమాజం కోసం ప్రతి కార్యకర్త కూడా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ కార్యదర్శి వై.ఓమయ్య, సిపిఐ జిల్లా నాయకులు బి.రఘురాం, అంజలి, హనుమాన్లు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

టాయిలెట్స్‌కు అడ్డుగా ఉన్న ట్యాంక్‌ను తొలగించండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యార్థిని విద్యార్థుల టాయిలెట్స్‌కు అడ్డుగా ఉన్న నీటి ట్యాంక్ ను తొలగించాలని ఏఐఎఫ్డిఎస్ ఆధ్వర్యంలో రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జాతీయ కన్వీనర్ మేత్రి రాజశేఖర్ మాట్లాడుతూ.. బోర్గాం (పి) జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో బాల-బాలికల టాయిలెట్స్‌కు అడ్డుగా ఉన్న పెద్ద నిల ట్యాంక్ పాఠశాల ఆవరణ నుంచి తొలగించి, వేరే చోటుకి తరలించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎఫ్డిఎస్ నాయకులు గోపాల్, అనిల్ యశ్వంత్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత

ఈత చెట్లను తొలగిస్తే సహించేది లేదు

- మండిపడ్డ గీత కార్మికులు



మాట్లాడుతున్న గీత సంఘం రాష్ట్ర కార్యదర్శి విఠల్‌గౌడ్

నవతెలంగాణ-కోటగిరి

ఈతచెట్లను తొలగిస్తే సహించేది లేదని తెలంగాణ గీత పని వాళ్ళ సంఘం రాష్ట్ర కార్యదర్శి విఠల్‌గౌడ్ అన్నారు. మండలంలోని లింగాపూర్ గ్రామంలో చెరువు కట్టకు ఆనుకొని ఉన్న భూముల్లో అక్రమంగా రైతు చొరబడి జెసిబి ద్వారా ఈత చెట్లను గురువారం తొలగించడంతో విఠల్‌గౌడ్ ఆధ్వర్యంలో అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈత చెట్లను తొలగించాలంటే ఎక్సైజ్ అధికారుల ద్వారా అనుమతులు తీసుకొని ఉండాలని లేకపోతే ఈత చెట్టు తొలగించిన వారిపై పిడి యాక్ట్ చట్టం కింద కేసు నమోదు చేస్తామన్నారు. రైతులు ఎవరైనా ఈత చెట్లను తొలగించాలంటే ఎక్సైజ్ నిబంధన ప్రకారం అనుమతులు పొందాలి తప్ప ఈత చెట్లను అక్రమంగా తొలగిస్తే సహించేదిలేదని అన్నారు. ఎక్సైజ్ అధికారులు ఇప్పటికైనా స్పందించి తొలగించిన ఈత చెట్లపై పంచనామ చేసి గీత కార్మికులకుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు బి.వెంక గౌడ్, కార్యదర్శి శ్రీధర్ గౌడ్, సహాయ కార్యదర్శి పండరి గౌడ్, ఉపాధ్యక్షులు యాదగిరి గౌడ్, గీత కార్మికులు రాజాగౌడ్, శ్రీకాంత్ గౌడ్ మొగులా గౌడ్ రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్ తీసుకునే ముందు వివరాలు తెలుసుకోండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జిల్లలో పాఠశాలలో ప్రవేశం తీసుకొనే ముందు ఆ పాఠశాలకు అనుమతి ఉన్నది, లేనిది సంబంధిత మండల విద్యాధికారి కార్యాలయంలో తెలుసుకోవాలని జిల్లా విద్యాధికారి ఎన్‌వి దుర్గాప్రసాద్ ఒక ప్రకటన తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాలు చేస్తున్న పాఠశాలలను గుర్తించి వాటిని మూసివేసేందుకు చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారులకు ఇది వరకే తెలిపామని పేర్కొన్నారు. అనుమతి పొందకుండా ప్రవేశాలు తీసుకొంటున్న పాఠశాలలని గుర్తించి, ఆ పాఠశాల ప్రచార బోర్డ్ లను, బ్యానర్ లను ఇది వరకే తొలగించామని తెలిపారు. ఈ విషయమై కొన్ని పత్రికలలో "అధికారులు నామ మాత్రపు తనిఖీ చేసి ముడుపులు తీసుకొని మ.. మ.. అనిపిస్తున్నారు" అని వచ్చిన వార్తలు అవాస్తవమని పేర్కొన్నారు. ఇంకా ఏవేని పాఠశాల ఉన్నట్లయితే వాటిని గుర్తించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఏదైనా పాఠశాల షిఫ్టింగ్, ప్రారంభ అనుమతి కొరకు దరఖాస్తు చేసుకున్నట్లయితే వాటిని పరిశీలించి పై అధికారులకు అందిస్తామని పేర్కొన్నారు. అన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, నిభందనలకు విరుద్ధంగా ప్రవేశాలు, వేసవి శిక్షణా తరగతులు, పాఠశాల ఆవరణలో బెల్ట్‌లు, యునిఫారంలు అమ్మకాలు చేయవద్దని తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి

- సిసెక్షన్ డెలివరీలు తగ్గాలి
- మలేరియాపై అవగాహన కల్పించాలి
- జిల్లా వైద్యాధికారి తుకారం రాథోడ్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ప్రభుత్వ డెలివరీలు మెరుగుపడాలని సి సెక్షన్ డెలివరీలు తగ్గించాలని మలేరియాపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి తుకారం రాథోడ్ గురువారం అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎం ఆశా వర్కర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వైద్యాధికారి తుకారం రాథోడ్ హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ మెరుగుపడాలని, సి-సెక్షన్ డెలివరీ తగ్గాలని అన్నారు. ఈ నెలలో అన్ని గ్రామాల్లో మలేరియాపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎన్‌సిడి స్క్రీన్ 30 ఏళ్లు పైబడిన వారందరికీ చేయాలన్నారు. అన్ని మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. డెంగ్యూ మలేరియా వ్యాధుల పైన అవగాహన కల్పిస్తూ ప్రజలను చైతన్య పరచాలన్నారు. వచ్చే వర్షాకాలం సీజన్లో అతిసార వ్యాధిన బడకుండా ఇంటింటికి అవగాహన కల్పిస్తూ ప్రజల ఆరోగ్యాలు కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి రవీందర్, ఎం.ఎల్ హెచ్పిలు, ఆరోగ్య విస్తరణ అధికారులు, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి తుకారం రాథోడ్

ఎన్నారైని సన్మానించిన కోటపాటి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షులు కోటపాటి నరసింహ నాయుడు గురువారం ఆయన కార్యాలయంలో ఎన్నారై కువైట్ అధ్యక్షులు బట్టు స్వామిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గల్ఫ్ కార్మికుల సమస్యలపై నిర్విరామ పోరాటం చేస్తున్న కోటపాటి సేవలు ఎంతో అభినందనీయమని అన్నారు.



సన్మానిస్తున్న దృశ్యం

కార్పొరేట్ ప్రయివేట్ కళాశాలల్లో ఫీజుల నియంత్రించాలి

- గుర్తింపులేని కళాశాలలను గుర్తించండి
- ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రవేట్ కార్పొరేట్ కళాశాలలో ఫీజుల నియంత్రణ ఏది అని, గుర్తింపు లేని ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలు అడ్మిషన్ ముసుగులో ఫీజులు మోత మోగిస్తున్నాయని గుర్తింపు లేని కళాశాలలు, అకాడమీల పేర్లతో ఇంటర్మీడియట్ అడ్మిషన్లు చేస్తున్న అకాడమీలను గుర్తించి ఆ అకాడమీ లపై క్రిమినల్ కేసులు చేయించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నిజామాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పర్మిషన్స్ లేకపోయినా అడ్మిషన్లు చేస్తూ కోట్ల రూపాయలను దండుకుంటున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం కాకుండానే కొన్ని ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలు తరగతులు ఎలా ప్రారంభిస్తారని ఆయన ప్రశ్నించారు. కొన్ని కళాశాలలో అడ్మిషన్లు అయిపోయాయని బోర్డు పెట్టడం బాధాకరమన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులు మోతలు మోగిస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి చోద్యం చూస్తున్నారు తప్ప గుర్తింపు లేని కళాశాలలును గుర్తించి ఆ కళాశాలల పై చర్యలు తీసుకోవడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఆయా విద్యా సంస్థలు విద్యను వ్యాపార పరం చేస్తున్న జిల్లా కలెక్టర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. డొనేషన్లు, బుక్స్, యూనిఫామ్ సపరేట్‌గా ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు బనాయించి ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంటర్మీడియట్ అడ్మిషన్ చేస్తూ ఫీజుల దందా చేస్తున్న అకాడమీలపై చర్యలు తీసుకోవాలి అని అన్నారు. ప్రభుత్వ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థుల సంఖ్యకునుగుణంగా మరుగుదొడ్లు మూత్రశాలలు ఏర్పాటుచేయాలని, సకాలంలో పాఠ్యపుస్తకాలు అందించాలని అన్నారు. శిథిలా వస్థకు చేరుకున్న భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలని కోరారు. లేకుంటే ఆందోళనకు పూనుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అంజలి, నాయకులు కుశాల్, తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి సరస్వతినగర్‌లో గురువారం ఇంటి సమీపంలో ఆడుకుంటున్న ఆరు సంవత్సరాల బాలుడిపై కుక్క దాడి చేయగా బాలుడికి గాయాలయ్యాయి. కాగా గత కొన్ని రోజుల నుండి పలు కాలనీల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, సమీపంలోని నిజాంసాగర్ కెనాల్‌లో చికెన్ వ్యర్థాలను పోస్తున్నారని, దీంతో సమీపంలోని కుక్కలు, పందులు ఎక్కువగా సంచరిస్తున్నాయని అన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

నవతెలంగాణ- నవీపేట్

మండల కేంద్రంలోని విద్యుత్ ఉప కేంద్రంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఏ డి ఈ సుహాసిని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప కేంద్రం పరిధిలో విద్యుత్ వినియోగదారులకు ఏవైనా సమస్యలు ఉంటే ఉదయం 10:30 కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని లిపారు. ఈ కార్యక్రమానికి విద్యుత్ వినియోగదారుల సంఘం అధ్యక్షుడు రామకష్ణ, సభ్యులు కిషన్, రాజాగౌడ్ హాజరవుతారని తెలిపారు.

శిఖం భూమి కబ్జా నుంచి కాపాడండి

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని చిక్లి గ్రామ శివారులోని చెరువులోగల భూములను కబ్జా నుంచి కాపాడాలని గ్రామస్తులు తహశీల్దార్ షబ్బీర్‌కు వినతి పత్రాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింతల చెరువు, రంగయ్య కుంట, వడ్యాట్ కుంట, పెద్ద చెరువు, రంగయ్య కుంట కబ్జాల నుంచి కాపాడాలని కోరారు. చెరువుల శిఖం భూములను కబ్జాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, చెరువులకు రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ, గ్రామస్థులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న చిక్లి గ్రామస్థులు

విమోచనాన్ని అధికారికంగా నిర్వహించాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రేవంత్ నీకు దమ్ముఉంటే సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. భారతీయ జనతా పార్టీ నిజామాబాద్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ నాయకులు రేవంత్ బుద్ధి తెచ్చుకొని ప్రవర్తిస్తారని అనుకుంటే మళ్లీ అవే అహంకారపు మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 6 నెలల్లో ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి ప్రజలంతా ఏకం అయ్యి బుద్ధి చెప్పిన ఆత్మవిమర్శ చేసుకోకుండా ఇంకా బిజెపిపైన ఏడవడం సరికాదని అన్నారు. రేవంత్ 15 స్థానాలు గెలుస్తామని గొప్పలు పలికి సొంత జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్సీ స్థానాల ఓటమికి బాధ్యత వహించి తక్షణమే రేవంత్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి డబుల్ డిజిట్ గెలుస్తుందని చెప్పడం జరిగిందని తెలిపారు. ఎనిమిది స్థానాల్లో ప్రజలు బీజేపీని ఆశీర్వదించి భారీ మెజారిటీ గెలిపించారని అన్నారు. పలుచోట్ల రెండోస్థానంలో గట్టి పోటీ ఇవ్వడం జరిగిందని, కాంగ్రెస్‌కు వచ్చిన సీట్లు కూడా బీఆర్ఎస్ చీకటి ఒప్పందంతోనే సాధ్యం అయ్యాయని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం అంశాలపైన రేవంత్‌కు కేసీఆర్‌కి ఒప్పందం కుదిరిందని అన్నారు. రేవంత్ చిహ్నాలు, గుర్తులు మార్చే శ్రద్ధ పాలన పైన పెట్టి ఇచ్చిన గ్యారంటీలను అమలు చేస్తే బాగుంటదని హితవు పలికారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని ఇచ్చిన గ్యారంటీలు అమలు చేయకపోతే తెలంగాణ ప్రజలు ప్రభుత్వాన్ని బొంద పెట్టడం ఖాయమని అన్నారు. రేవంత్ సోనియా మెప్పు కోసం తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టె ప్రయత్నం చేస్తున్నారని, ఆనాడు బలిదేవత సోనియమ్మ అన్న రేవంత్ ఈనాడు తెలంగాణ తల్లి అని ఆమె పుట్టినరోజు తెలంగాణ తల్లి ఉత్సవాలు నిర్వహించడం బిజెపి పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. రేవంత్ నీకు దమ్ముఉంటే సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలని, మత రాజకీయాలతో ఓ వర్గం మెప్పు కోసం తెలంగాణ అమరుల, ఆశయాలను ఆకాంక్షలను ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఇందూర్ అర్బన్‌లో పది శాతం ఓట్లు పెరిగాయి అని, రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంటాం అని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు, స్థానిక కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నీలకంఠేశ్వర ఆలయం భూములకు వేలం

నవతెలంగాణ-రెంజల్



మండలంలోని నీల గ్రామంలోని నీలకంఠేశ్వర ఆలయం భూములను గురువారం వేలం వేసినట్లు దేవాదాయ శాఖ అధికారిని కమల పేర్కొన్నారు. నీలకంఠేశ్వర ఆలయానికి సుమారుగా 27 ఎకరాల భూమి ఉందని, దీనిలో 16ఎకరాల మూడు గుంటలకు లక్షా 60 వేల 700 రూపాయలకు వేలం వేయడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. త్వరలోనే ఈ ఆలయానికి సంబంధించిన భూములు ఆలయ కమిటీకి అప్పగించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఖ్యాతం యోగేష్, రాఘవేందర్, రామచందర్, పాశం భాస్కర్, మాజీ సర్పంచ్ రఘు, సుభాష్, దేవాదాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ

నవతెలంగాణ-మాక్లూర్



మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాక్లూర్ పరిధి గ్రామాల్లో కల్లెడి, గుత్ప, మాక్లూర్, మాధపూర్, రాంచంద్రపల్లి, డికంపల్లి, చీక్లి, చిన్నాపూర్, మామిడిపల్లి కేంద్రాల్లో గురువారం జీలుగు సబ్సిడీ విత్తనాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులు 30 కిలోల బస్తను 2.20 ఎకరాలకు చల్లుకోవాలని అన్నారు. సబ్సిడీ ధర రూ. 1116 చెల్లించాలని, బస్ బుక్, అదర్ జీరాక్స్ సంబంధిత అధికారులకు అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు భూర్రోళ్ళ అశోక్, సంఘ డైరెక్టర్లు, మండల వ్యవసాయ అధికారిని పద్మ, విస్తరణ అధికారి ఉమాదేవి, గ్రామ రైతులు పాల్గొనడం జరిగింది.

గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- రైతుల అవసరాలకు సరిపడా అందుబాటులో ఎరువులు, విత్తనాలు
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- స్కూల్ యూనిఫామ్‌లను సకాలంలో అందించేలా చర్యలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



వీసీలో మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



పాల్గొన్న కలెక్టర్, అధికారులు

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 09 న జరుగనున్న గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. వానాకాలం సీజన్ పంటల సలాగుకు సంబంధించి జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. పాఠశాలలు ప్రారంభం అయ్యే నాటికి అన్ని ప్రభుత్వ బడులలో విద్యార్థిని, విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ లు అందించేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని అన్నారు. పై అంశాలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి ఉన్నతాధికారులైన రాష్ట్ర డీజీపీ రవిగుప్తా, టీజీపీఎస్సీ ఛైర్మన్ ఎం.మహేందర్ రెడ్డి తదితరులతో కలిసి ఆయా జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణ కోసం చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీ.ఎస్ సూచనలు చేశారు. అదేవిధంగా ఎరువులు, విత్తనాలు, విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ, అన్ని నివాస ప్రాంతాల్లో ఇంటింటికి మిషన్ భగీరథ ద్వారా రక్షిత మంచి నీటి సరఫరా, కలెక్టరేట్ సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ప్లాస్టిక్ బాటిళ్లను వినియోగించకుండా చూడడం తదితర అంశాలపై మార్గనిర్దేశం చేశారు. ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల క్రతువును రాష్ట్రంలో ఎలాంటి లోటుపాట్లు, అపశ్రుతులు తావులేకుండా విజయవంతంగా నిర్వహించడం పట్ల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్ని జిల్లాల కలెక్టర్లను, పోలీస్ కమిషనర్లను, ఎస్పీలను ఈ సందర్భంగా అభినందించారు.

గ్రూప్-1 కోసం 41కేంద్రాలు

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై సూచనలు చేశారు. జిల్లాలో 12833 మంది అభ్యర్థులు గ్రూప్-1 పరీక్ష రాయనుండగా, వారి కోసం 41 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సాఫీగా నిర్వహించాలని, చీఫ్ సూపెరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లు, రూట్ ఆఫీసర్లకు పరీక్షల నిర్వహణ విధులపై స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాలలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, మంచినీరు, అవసరమైన పక్షంలో వెంటనే ఫస్ట్ ఎయిడ్ చికిత్స అందించేలా ఏఎన్ఎంలను నియమించాలని, సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలని అన్నారు. 144 సెక్షన్ అమలు చేస్తూ, ఎగ్జామ్ సెంటర్ల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూసివేయించాలన్నారు. బయోమెట్రిక్ విధానం అమలులో ఉన్నందున అభ్యర్థులు కనీసం రెండు గంటల ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు ఆబ్జెక్టివ్ ప్రశ్నలతో ఓఎంఆర్ పద్ధతిలో ప్రిలిమినరీ పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులను ఉదయం 9 గంటల నుండి పరీక్షా కేంద్రాల లోనికి వెళ్లేందుకు అనుమతించడం జరుగుతుందని, ఉదయం పది గంటలకు మెయిన్ గేట్లు మూసివేస్తారని తెలిపారు. బయో-మెట్రిక్ హాజరు స్వీకరణ కోసం ఈసారి ప్రత్యేకంగా ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేస్తున్నారని, 160 మంది అభ్యర్థులకు ఒకటి చొప్పున బయో-మెట్రిక్ యంత్రాన్ని సమకూర్చాలని, అదనపు యంత్రాలను కూడా అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి పంపించేందుకు వీలుగా చర్యలు చేపట్టాలని, మహిళా పోలీసులు, ఇతర మహిళా సిబ్బందిని సైతం కేంద్రాల వద్ద నియమించాలని సూచించారు. సెల్ ఫోన్లు, ఇతర అన్ని రకాల ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్ నుండి ప్రశ్న పత్రాలు, ఇతర సామాగ్రిని పరీక్ష కేంద్రాలకు తరలించాలని, పరీక్ష ముగిసిన అనంతరం కూడా పూర్తి భద్రతా నడుమ ఓ.ఎం.ఆర్ షీట్లను స్ట్రాంగ్ రూమ్ కు చేర్చాలని అన్నారు. రీజినల్ కో ఆర్డినేటర్, చీఫ్ సూపెరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు, సంబంధిత శాఖల అధికారులు అందరూ సమన్వయంతో పనిచేయాలని, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా పేర్కొనబడిన తు.చ తప్పకుండా అమలయ్యేలా చూడాలన్నారు.

అందుబాటులో సరిపడా ఎరువులు

జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు విత్తనాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 6700 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు పంపిణీ చేయడం జరిగిందని, మరో 830 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ కోసం సిద్ధంగా ఉన్నాయని వివరించారు. అదేవిధంగా యూరియా, డీఏపీ, కాంప్లెక్ ఇతర అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఎరువులు, విత్తనాల నిల్వలు పూర్తి స్థాయిలో ఉన్నందున, ఎక్కడ కూడా రైతులకు కొరత ఏర్పడకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భీంగల్ ప్రాంతంలో ఒకింత ఎక్కువ మోతాదులో రైతులు పత్తి పంట సాగు చేస్తారని, వారికి పత్తి విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రైవేట్ డీలర్లు, వ్యాపారాలు కృత్రిమ కొరత సృష్టించకుండా గట్టి నిఘా ఉంచాలని, పోలీస్, రెవెన్యూ అధికారులను సమన్వయము చేసుకుని ఎరువులు, విత్తన డీలర్ షాపులను విస్తృత స్థాయిలో తనిఖీలు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. స్టాక్ రిజిస్టర్ల నిల్వలను, విత్తనాల నాణ్యతను పరిశీలించాలని, అవకతవకలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నకిలీ, నాసిరకం విత్తనాలపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని, జిల్లాలో ఏ ఒక్క రైతు కూడా నకిలీ విత్తనాలు, ఎరువుల కారణంగా నష్టపోకుండా పకడ్బందీ పర్యవేక్షణ కొనసాగించాలని హితవు పలికారు.

47,409 యూనిఫాంలు సిద్ధం

బడులు తెరుచుకునేందుకు మరో ఐదు రోజుల వ్యవధి మాత్రమే మిగిలిఉన్న దృష్ట్యా విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్ లు అందించేలా కృషి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో 110746 యూనిఫామ్‌లను తయారు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 47409 యూనిఫామ్‌లు సిద్ధం అయ్యాయని, మిగితా వాటిని ఐదు రోజుల వ్యవధిలో కుట్టు పని పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి రోజు కనీసం 10 వేలకు తగ్గకుండా ఏకరూప దుస్తులు స్టిచ్చింగ్ చేసేలా పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. యూనిఫామ్ ల తయారీ ప్రగతికి సంబంధిన వివరాలతో ఆయా మండలాల వారీగా ప్రతిరోజూ తనకు నివేదికలు పంపాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నివాస ప్రాంతాలలో తాగునీటి సరఫరా తీరును పరిశీలించేందుకు క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే జరిపించాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ వినియోగాన్ని విడనాడాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీఆర్డీఓ సాయాగౌడ్, డీపీఓ తరుణ్ చక్రవర్తి, డీఈఓ దుర్గాప్రసాద్, గ్రూప్-1 పరీక్షల ప్రాంతీయ సమన్వయకర్త రామ్మోహన్ రావు, మెప్మా పీడీ రాజేందర్, విత్తన అభివృద్ధి సంస్థ అధికారి శ్రీకర్, తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసి.. ఫోన్లు లాక్కొని

- జర్నలిస్టుపై దాడి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా శివారు ప్రాంతంలో మే 30 రాత్రి 8 గంటలకు జర్నలిస్టు నరేష్‌పై దాడి చేసి ఫోన్లు లాక్కున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సదురు జర్నలిస్టు కొందరు చేస్తున్న అవినీతి అక్రమాల సమాచారం, బాధితులు ఇచ్చిన వివరాలను ఫోన్‌లో తీసుకున్నాడు. దీంతో రెక్కి నిర్వహించి, పక్కా ప్లాన్‌తో సదరు జర్నలిస్టుపై విచక్షణా రహితంగా దాడి చేసి ఆయన వద్దనున్న రెండు ఫోన్లు లాక్కున్నారు. గాయాలతో ఉన్న జర్నలిస్టును రాత్రి 12 సమయంలో స్థానిక జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై బాధిత జర్నలిస్టు నరేష్ నిజామాబాద్ 4వ టౌన్‌లో మే 31 న రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అక్రమాలకు పాల్పడుతున్న వారిపై న్యూస్ రాసిన జర్నలిస్టుపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు, జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి : పీడీఎస్‌యూ



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు పి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ అన్నారు. పిడిఎస్‌యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నగరంలోని కోటగల్లీలోగల సంఘం కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాల ఆగడాలకు హద్దు అదుపు లేకుండా వ్యవహరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని దుయ్యబట్టారు. ఎల్కేజీ నుంచి లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను పీల్చి పిప్పి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టెక్నో, ఈ టెక్నో, ఐఐటి వంటి తోక పేర్లను తగిలించి బోర్డులను ఏర్పాటు చేసి యథేచ్ఛగా అడ్మిషన్లు నిర్వహిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని తెలిపారు. విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించడం కోసం టెస్టులు పెడుతూ అడ్మిషన్లు బహిరంగంగా నమోదు చేస్తున్నారన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్లు నమోదు చేసి విద్యాసంస్థలలోనే పాఠ్యపుస్తకాలు అమ్మకాలు మొదలుపెట్టి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారన్నారు. ఫీజుల వివరాలను బోర్డులో ఏర్పాటు చేయడంలేదన్నారు. స్కూలు, అడ్మిషన్, బస్, హాస్టల్, దోబీ ఫీజుల పేరుతో డబ్బులు దండుకుంటున్న కనీసం అధికారులు పట్టించుకోని దుస్థితి నెలకొందన్నారు. కార్పొరేట్ విద్యా వ్యాపారాన్ని నియంత్రించకపోతే ప్రత్యక్ష ఆందోళనకు పూనుకుంటామని వారు హెచ్చరించారు. సమావేశంలో పిడిఎస్‌యు జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు నరేందర్, డిఆర్ కర్క గణేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఆశురు, అనిల్, సహాయ కార్యదర్శులు నిఖిల్, చందు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిశీలించిన నూతన ఎస్ఈ



గేట్ల మరమ్మతుల పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ

నవతెలంగాణ - మెండోరా

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నూతన ఎస్ఈ శ్రీనివాస్ రావు గుప్తా గురువారం ప్రాజెక్టును సందర్శించి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అధికారుల వద్ద ప్రాజెక్టు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాజక్టు వద్ద కొనసాగుతున్న గేట్ల మరమ్మతు ల పనులు పరిశీలించారు. గత శుక్రవారం ప్రాజెక్టు లో విధులు నిర్వహించిన శ్రీనివాస్ రెడ్డి ఉద్యోగ విరమణ పొందడంతో కరీంనగర్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధుల్లో కొనసాగుతూ ప్రమోషన్‌పై వచ్చి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎస్ఈగా బాధ్యతలు తీసుకున్నారు. ప్రాజక్టు ఇన్ఫ్లో నీటిమట్టం వివరాలు డిజిటల్ కెమెరా టివి లో పరిశీలించి ప్రాజెక్టు అధికారులకు పలు అంశాలపై సూచనలు చేశారు. వారితో పాటు ప్రాజెక్టు ఈఈ చక్రపాణి, డిఈఈ గణేష్, ఎఈఈ అక్తర్ పలువురు ప్రాజెక్టు అధికారులు ఉన్నారు.

రికార్డులు నమోదు చేయాలి : ఏవో

నవతెలంగాణ-మాక్లూర్

ఫెసి సైడ్ షాప్‌లో రైతు వారి రికార్డులను నమోదు చేయాలని డీలర్లకు మండల వ్యవసాయాధికారిని పి.పద్మ సూచించారు. గురువారం మండలంలోని పలు ఫెస్టిసైడ్ షాప్‌లను తనిఖీ చేశారు. మందుల వివరాలు, వాటి ధరలను పట్టిక లో రాజు వారీగా రాయాలని అన్నారు. రైతుల సమాచారం రికార్డుల్లో నమోదు చేయాలని డీలర్లకు ఆమె తెలిపారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ

నవతెలంగాణ-నవీపేట్



స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న అధికారి

మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో నకిలీ విత్తనాల వివరాలను మండల టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు గురువారం తనిఖీ నిర్వహించారు. నకిలీ విత్తనాలు అమ్మితే చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసిల్దార్ నారాయణ, ఎస్సై యాదగిరి గౌడ్, మండల వ్యవసాధికారి సురేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

ధర్మ సమాజ్ పార్టీ రూపొందించిన లోగోను రాష్ట్ర చిహ్నంగా ఆమోదించాలి

నవతెలంగాణ-మాక్లూర్

ధర్మ సమాజ్ పార్టీ రూపొందించిన లోగోను రాష్ట్ర చిహ్నంగా ఆమెదించాలని ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో తహశీల్దార్ షబ్బీర్ కు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చిహ్నం మార్పును ఆహ్వానిస్తూ ధర్మ సమాజ్ పార్టీ రూపొందించిన రాష్ట్ర చిహ్నంలో డాక్టర్ అంబేద్కర్ చిత్రంతో పాటు ఉస్మానియా విశ్వ విద్యాలయం పొందుపరచడం జరిగిందన్నారు. అందులో పండుగ సాయన్న, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, సమ్మక్క, సారలక్క చిత్రా పటాలతో రూపొందించారని తెలిపారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించ వలసినదిగా మా ప్రతిపాదనను పైకి పంపివ్వాలని తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేసి కోరారు. కార్యక్రమంలో మాక్లూర్ మండల నాయకులు సరికెల రమేష్, గంగాధర్, శ్రీహరి, వినయ్, సాయి కుమార్, మహేష్ పాల్గొన్నారు.


బడిబాటలో 15మందికి అడ్మిషన్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంతో పాటు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం గురువారం ప్రారంభించినట్లు మండల విద్యాధికారి రాజా గంగారాం తెలిపారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, శాస్త్రి నగర్ లో ఇంటింటికీ వెళ్లారు. శాస్త్రి నగర్‌లో దాదాపు 15 మంది పిల్లలు నూతనంగా అడ్మిషన్ తీసుకోవడం జరిగిందని ప్రధానోపాధ్యాయురాలు వనజ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు త్రివేణి , సోహైల్ రిజ్వాన తదితరులు పాల్గొన్నారు.

మంత్రి,ఎమ్మెల్సీని కలిసిన కాంగ్రెస్ నాయకుడు

నవతెలంగాణ-ఏర్గట్ల



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో..

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 8 ఎంపీ సీట్లు గెలుచుకోవడంతో మండల కేంద్రానికి చెందిన,కాంగ్రెస్ నాయకులు తుపాకుల శ్రీనివాస్ గౌడ్ గురువారం మంత్రి, ఎమ్మెల్సీలను కలిశారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ లను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామ మహిళా సంఘ సమావేశం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కలిగొట్ గ్రామంలో గ్రామ మహిళా సంఘ సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, అంతర్గత అప్పులు తదితర అంశాలపైన చర్చించారు. అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో స్కూల్ పిల్లలకు ఏకరూప దుస్తులు కుట్టించాలని కమ్యూనిటీ కోఆర్డినేటర్ బాబు తెలిపారు. సమావేశంలో గ్రామ సంఘం ప్రతినిధులు, సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- బోర్గం(పి) ప్రభుత్వ పాఠశాలలో పనులు పరిశీలన

నవతెలంగాణ-మోపాల్



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు ధీటుగా విద్యను అందిస్తామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని బోర్గాం(పి) జెడ్పీహెచ్ఎస్‌లో పాఠశాలలో అమ్మ ఆదర్శ పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ బోర్గం ప్రభుత్వ పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల నిధుల కింద 22 లక్షల రూపాయలను కేటాయించామని, ఈ పాఠశాలకు జిల్లాలోనే ప్రాముఖ్యత ఉందని బోర్గం పాఠశాలలో చదివిన వారు చాలా మంది దేశ విదేశాల్లో ఉంటూ ఉన్నత స్థాయిలో కూడా ఉన్నారని ఆయన తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను, వైద్య వ్యవస్థను నిర్వీర్యం చేసిందని అన్నారు. కేవలం ధనార్జన తప్ప ప్రజా సంక్షేమం పైన దృష్టి పెట్టలేదని, కెసిఆర్ ప్రభుత్వానికి దాచుకోవడం దోచుకోవడం తప్ప అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే ప్రభుత్వ స్కూళ్లకు మహర్దశ ప్రారంభమైందని, టీచర్ పోస్టుల భర్తీలను కూడా త్వరలో చేసి తీరుతామని అన్నారు. ఈ అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానస పుత్రిక అని, ఈ నిధులే కాకుండా వచ్చే రోజుల్లో మరిన్ని నిధులను కేటాయించి ఇంకా మౌలిక సదుపాయాలు కూడా కల్పించే విధంగా చూస్తామని ఆయన తెలిపారు. పాఠశాలలు ప్రారంభమయ్యే లోపు పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారని, ఆ దిశగా పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. కార్పొరేట్‌కు ధీటుగా విద్యనందిస్తామని, ఇంటర్మీడియేట్ వరకూ ఇ క్కడే చదువుకోవచ్చన్నారు. ఆయన వెంట పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్, చామకూర అనిల్ రెడ్డి, నాయకులు ఈగ రమేష్‌రెడ్డి, సాయిరెడ్డి, గుత్ప రఘు, సుభాష్, శేఖర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, అనిల్ రెడ్డి, అశోక్, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన బుద్ధి చెబుతాం

నవతెలంగాణ-బోధన్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఎంపీ ధర్మపురి అరవింద్ నోటికి వచ్చినట్లు మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించే ప్రసక్తి ఉండదని, లేనియెడల తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి పిసిసి డెలిగేట్ గంగ శంకర్ హెచ్చరించారు. గురువారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కౌన్సిలర్ తూము షరత్‌రెడ్డి డిసిసి డెలిగేట్ గంగ శంకర్ మాట్లాడారు. బీఆర్ఎస్ ఓట్ల పుణ్యంతో ఎంపీ ధర్మపురి అరవింద్ గెలుపొందారని, ఆయన గెలుపు అసలు గెలుపే కాదని, అది ఓటమికి నాంది అని వారు ఎద్దేవా చేశారు. చిన్నా పెద్ద తేడా లేకుండా నోటికి వచ్చినట్లు అహంకారంగా మాట్లాడడం తగ్గించుకోవాలని వారు హెచ్చరించారు. ఎన్నికల్లో బిజెపి కార్యకర్తలు ఆయనకు సహకరించక పోవడంతో బీఆర్ఎస్ పార్టీ సహకారంతో గెలిచారని అన్నారు. ఎన్నికల ప్రచారంలో తనను చూసి కాకుండా ప్రధాని మోడీని చూసి ఓటేయాలని అడిగారని గుర్తు చేశారు. ఐదు సంవత్సరాలుగా ఎంపీగా ఉన్న ధర్మపురి అరవింద్ బోధన్ నియోజకవర్గాన్ని కానీ జిల్లాను కానీ ఏమీ అభివృద్ధి చేయలేదని, మళ్లీ ఈ ఐదు సంవత్సరాలు కూడా ఆయన ఏమి చేయలేరని విమర్శించారు. సుదర్శన్ రెడ్డి మంత్రిగా ఉన్న కాలంలో జలయజ్ఞం పథకంలో ఎన్నో పనులను చేశారని అన్నారు. బోధన్ పట్టణంలో గల 56 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేసి ఎందరికో ఉపాధి కల్పించారని అన్నారు. పది సంవత్సరాల కాలంలో గాడి తప్పిన విద్య వ్యవస్థను ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు కావలసిన సౌకర్యాలను ఏర్పాటు చేస్తూ విద్య వ్యవస్థను బలోపేతం చేస్తున్నారని అన్నారు. మరోసారి ఎంపీ అరవింద్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అనవసరంగా విమర్శించిన బోధన్‌లో తిరిగే పరిస్థితి ఉండదని హెచ్చరించారు. సమావేశంలో సీనియర్ నాయకులు పాషా మొహినోద్దీన్, హరికాంత్ చారి ,గౌసోద్దీన్, ఆనంపల్లి ఎల్లయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.